క్లుప్తంగా

ఆర్‌బీకేలకు చేరిన ఎరువులు



చాటాయవలస ఆర్‌బీకే వద్ద అన్‌లోడ్ చేస్తున్న ఎరువుల బస్తాలు

రేగిడి: మండలంలోని ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం)లకు యూరియా, డీఏపీ వంటి ఎరువులు వచ్చి, చేరుతున్నాయి. ఖరీఫ్ సాగుకు సంబంధించి, విత్తనాలు, ఎరువులు కావాల్సిన రైతులు ఆర్‌బీకేలకు వెళ్లి, అవసరమైన వాటిని తీసుకోవాలని ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. ప్రస్తుతం అన్నిచోట్ల ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయన్నారు. మంచి దిగుబడులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులనే కొనుగోలు చేసి, వాడుకోవాలని సూచించారు.

వంగరలో ప్రజాదర్బార్

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఈ కార్యక్రమానికి హాజరై, మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు సమర్పించిన వినతులను స్వీకరించి, ఆయా వినతుల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిరంజీవి పరాగ్, ఎంపీడీవో సాల్మాన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి..



భుజంగరావు మాస్టారును సన్మానిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, తదితరులు

వంగర: ప్రభుత్వ ఉద్యోగులకు తమ విధి నిర్వహణలో ప్రజలకు అందించిన గొప్పసేవలే వారికి మంచి గుర్తింపును ఇస్తాయని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. మండలంలోని అరసాడ ప్రాథమిక పాఠశాల-1లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన కోరాడ భుజంగరావు దంపతులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యాభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రగతికి భుజంగరావు చేసిన సేవలు అభినందనీయమన్నారు. ఆయన తన ఉద్యోగ నిర్వహణ కాలంలో ఎంతోమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కరణం సుదర్శనరావు, సర్పంచ్ లచ్చుభుక్త సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



కూనాయవలసలో పింఛన్ డబ్బులు అందిస్తున్న సర్పంచ్ విజయబాబు

తెర్లాం/రాజాం/బొబ్బిలి రూరల్: మండలాల్లోని పలు గ్రామాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. తొలిరోజు జరిగిన పింఛన్ల పంపిణీలో అందుబాటులో లేని లబ్ధిదారులకు సచివాలయ ఉద్యోగులు మంగళవారం పింఛన్ నగదు అందజేశారు. తెర్లాం మండలంలో మొత్తం 9,787 పింఛన్లకు గాను 9,707 పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో మధుసూదనరావు తెలపగా, బొబ్బిలి మండలంలోని మొత్తం 11,083 మంది లబ్ధిదారుల్లో ఇప్పటివరకు 10,983 మందికి పింఛన్ అందజేశామని ఎంపీడీవో పి.రవికుమార్ వెల్లడించారు.

బ్యాగులు, పుస్తకాల వితరణ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దాతలు

బొబ్బిలి రూరల్: మండలంలోని జగన్నాధపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామ సర్పంచ్ బొద్దల పద్మాసత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు రౌతు తిరుపతిరావులు బ్యాగులు, పుస్తకాలు మంగళవారం వితరణ చేశారు. ప్రతిఏటా నిరుపేదల పిల్లలకు అవసరమైన విద్యాసామగ్రి పంపిణీ చేస్తుండడం ఆనందంగా ఉందని దాతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ఆశాజ్యోతి, వార్డు మెంబరు మంతిన మంగమ్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

- ప్రభుత్వాస్పత్రుల్లో నరిపడా నిల్వలు
- ప్రతి శని, బుధవారాల్లో వ్యాక్సినేషన్



రామభద్రపురం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

రామభద్రపురం: వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేసుకోవాలి. గర్భిణుల నుంచి అప్పుడే పుట్టిన శిశువు వరకు ప్రభుత్వం సూచించిన సమయాల్లో టీకాలు వేయిస్తే వ్యాధులు దరిచేరకుండా ఆరోగ్యంగా జీవించవచ్చు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో సరైన అవగాహన లేని కారణంగా టీకాలు వేయించుకోవడం లేదు. దీనివల్ల రకరకాల వ్యాధులకు గురవుతూ జీవితం దుర్భరం చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలపై ప్రజలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ వైద్య సిబ్బంది ప్రతి శని, బుధవారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారని చెబుతున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

వ్యాక్సిన్లు వేసేది ఇలా..

- గర్భిణీగా నిర్ధారణ అయిన 3 నెలలు నిండిన తర్వాత ఒక టీటీ ఇంజెక్షన్, అనంతరం ఇంకో నెలరోజుల వ్యవధిలోనే మరో టీటీ ఇంజెంక్షన్ వేయాలి. వీటితో పాటు ఐరన్ ఫోలిక్, కాల్షియం టాబ్లెట్లు ఇస్తారు. ప్రసవానంతరం ఐరన్ టాబ్లెట్లు ఇస్తారు.
- అప్పుడే పుట్టిన శిశువుకి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్-బి డోసు వేయాలి. వీటివల్ల పోలియో, పచ్చకామెర్ల వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుంది. 14 రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి. 6, 14 వారాల్లో ఐపీవీ చుక్కలు వేయించాలి.
- 6, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటా వాలెంట్ వేయించాలి. వీటి వల్ల కోరింతదగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, మెదడువాపు, పచ్చకామెర్లు వంటి వ్యాధుల నుంచి చిన్నారిని కాపాడవచ్చు.
- తొమ్మిది నెలల నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్-ఎ చుక్కలు వేయించాలి. తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల వయసు వరకు ప్రతీ ఆరు నెలలకోసారి విటమిన్-ఎ చుక్కలు మొత్తం తొమ్మిది డోసులు ఇప్పించాలి.
- 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోసు డీపీటీ, మీజిల్స్, విటమిన్-ఎ ఓపీని వేయించాలి.
- ఐదేళ్లు పూర్తయిన తర్వాత డీపీటీ డోసు వేయించాలి. 10, 16 సంవత్సరాలు పూర్తయితే టీటీ వేయించాలి.

అవగాహన కల్పిస్తున్నాం..



గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలోగా వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలి. వీటివల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. గ్రామీణ ప్రాంత ప్రజలకు టీకాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ దిలీప్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి, రామభద్రపురం.

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్

రేగిడి: మండలంలోని పనసలవలస గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మీసాల సుదర్శనరావును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లు మంగళవారం కలిసి పరామర్శించారు. సుదర్శనరావు తండ్రి అప్పలనాయుడు ఇటీవల మృతి చెందగా, ఈ విషయం తెలుసుకున్న సదరు నేతలు ఆ గ్రామం వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, అప్పాపురం, వన్నలి, ఆడవరం పంచాయతీల సర్పంచ్‌లు కరణం శ్రీనివాసరావు, గార రమణ, మొయ్యి కృష్ణమూర్తినాయుడు, పాలవలస దవళేశ్వరరావు, కడగల గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చర్యలు



క్లోరినేషన్‌కు సంబంధించి, సూచనలు చేస్తున్న డీఈఈ రెడ్డి

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది, మెట్టవలస గ్రామాల్లోని తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చర్యలు మంగళవారం చేపట్టారు. ఆయా చర్యలను గ్రామీణ నీటి పారుదల శాఖ డీఈఈ పి.ఎం.కె.రెడ్డి పరిశీలించి, పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో కలుషిత నీటిని తాగడం వల్ల సీజనల్ వ్యాధులు తలెత్తుతాయని, వాటి బారినపడకుండా ఉండాలంటే సురక్షితమైన మంచినీటినే తాగాలన్నారు. అనంతరం క్లోరినేషన్ ఎలా చేయాలి, ఎంతమోతాదులో క్లోరిన్ కలపాలన్న దానిపై అవగాహన కల్పించారు. ఆయన వెంట జేఈ శ్రావణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం



యోగా శిక్షణ తరగతుల్లో యోగా ప్రాధాన్యాన్ని వివరిస్తున్న యోగా గురువు రమణమూర్తి

రాజాం సిటీ: మానవ జీవితంలో ప్రస్తుతం తలెత్తుతున్న తీవ్రమైన ఒత్తిడిని జయించేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుందని యోగా గురువు టీటీపీ రమణమూర్తి అన్నారు. స్థానిక పట్టణంలోని విద్యానికేతన్ స్కూల్‌లో మంగళారం ఉదయం పురుషులకు, వికాస తరంగిణి కార్యాలయంలో సాయంత్రం మహిళలకు ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడి, అనారోగ్య సమస్యల బారినపడకుండా ప్రతిరోజూ యోగా చేయాలని సూచించారు. మారిన ఆహారపు అలవాట్లతో ఏ చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చినా తట్టుకునే పరిస్థితి లేదన్నారు. ఈ సమస్యలన్నింటినీ అధిగమించేందుకు యోగా చక్కని ఔషధంలా పనిచేస్తుందన్నారు. యోగా సాధనతో పిల్లల మానసిక ప్రవర్తనలోనూ మార్పు వస్తుందన్నారు. నిత్యం యోగా సాధనతో మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం, జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందన్నారు. 10 రోజుల పాటు జరగనున్న ఈ శిక్షణలో సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం నేర్పిస్తామన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

బొబ్బిలి రూరల్: సీజనల్ వ్యాధుల బారినపడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో పి.రవికుమార్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సీజనల్ వ్యాధులు, వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగేలా రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని తెలిపారు. అలాగే వర్షాకాలంలో విజృంభించే మలేరియా, డెంగీ, టైఫాయిడ్, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తపడాలన్నారు. కార్యక్రమంలో పక్కి, పిరిడి పీహెచ్‌సీల వైద్యాధికారులు భరద్వాజ, లక్ష్మి, ఈవోపీఆర్‌డీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


బంద్‌ను విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

బొబ్బిలి: నీట్ పరీక్ష పేపరు లీకేజీ ఘటనను వ్యతిరేకిస్తూ ఈ నెల 4వ తేదీన చేపట్టే దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వి.శ్రావణ్‌కుమార్, వి.భరత్‌కుమార్, మణిలు కోరారు. స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో బంద్‌కు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ స్థాయి పరీక్షలు నిర్వహించడంలో ఎన్‌టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) విఫలమైందని, ఎప్పటికప్పుడు పోటీ పరీక్షల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన నీట్ పరీక్ష లీకేజీ తెరవెనుక కుంభకోణం, నీట్ పీజీ పరీక్షను 12 గంటల ముందు వాయిదా వేయడం, యూజీసీ నెట్ పరీక్ష రద్దు వంటివి విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. నీట్ పరీక్ష స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. నీట్ పరీక్ష పేపరు లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖామంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి



రాజయ్యపేటలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని రాజయ్యపేటలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆయన మంగళవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో అపరిశుభ్రత కారణంగా వచ్చే వ్యాధులు, వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంచాయతీ కార్యదర్శులంతా గ్రామాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు.

మెనూ ప్రకారం వంటకాలు చేయండి



పెదపాలవలస పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూసి, పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న పీఎం పోషణ గోరుముద్ద పథకానికి సంబంధించి, మెనూ అమలులో లోపాలుంటే సంబంధిత భోజన పథకం నిర్వాహకులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని ఎంఈవో జె.త్రినాధరావు అన్నారు. మండలంలోని పెదపాలవలస ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, పరిసరాలు, మధ్యాహ్న భోజన పథకం వంటకాలు, మరుగుదొడ్లు, విద్యార్థుల చేతిరాత పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోరుముద్ద పథకంలో మెనూ సక్రమంగా అమలు జరిగేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని, విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్లు అందించాలని తెలిపారు.

కొత్తచట్టాలపై అవగాహన అవసరం



కొత్తచట్టాల బుక్‌లెట్‌లతో రూరల్ సీఐ శ్రీనివాసరావు, తదితరులు



వంగర: కొత్త చట్టాల పుస్తకాన్ని అందిస్తున్న పోలీసులు

రాజాం సిటీ: దేశ వ్యాప్తంగా ఈ నెల 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన ఐపీసీ కొత్తచట్టాలపై అవగాహన అవసరమని రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో పలువురు ప్రజాప్రతినిధులతో మంగళవారం సమావేశమైన ఆయన.. కొత్త చట్టాలను వివరించారు. ఈ చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే నేర నియంత్రణ జరుగుతుందన్నారు. అనంతరం చట్టాలకు సంబంధించిన బుక్‌లెట్‌లను వారికి అందించారు.

వంగర: కొత్తగా అమల్లోకి వచ్చిన చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని హెచ్‌సీ దూసి రాములు అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. భారతీయ శిక్షా స్మృతి(ఐపీసీ) నేర శిక్షా స్మృతి(సీఆర్‌పీసీ) స్థానంలో కొత్తగా భారతీయ న్యాయ సంహిత(బీఎన్‌ఎస్)భారతీయ నాగరిక్ సురక్షా సంహిత(బీఎన్‌ఎస్‌ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్(బీఎస్‌ఏ) చట్టాలు అమల్లోకి వచ్చాయని పేర్కొన్నారు. అనంతరం కొత్త చట్టాల పుస్తకాలు పంపిణీ చేశారు.

మోక్షప్రదాయిని.. భగవద్గీత



ప్రసంగిస్తున్న ఆధ్యాత్మిక వక్త రమణ

రేగిడి: భగవద్గీత మోక్షప్రదాయిని అని, భగవద్గీతను పఠిస్తే మోక్షం లభిస్తుందని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్.వి.రమణ అన్నారు. మండలంలోని దేవుదళ గీతా మందిరంలో గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో దివ్యజీవన సత్సంగ సభ మంగళవారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ భగవద్గీతను చదవడం దినచర్యగా చేసుకోవాలని, భగవద్గీత చదవడం ద్వారా చెడుగీతలు చెరిగిపోతాయన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పని ఒత్తిడి, కుటుంబ తగాదాల కారణంగా మానసిక ప్రశాంతత లేని జీవితం గడుపుతున్నారని, ఆధ్యాత్మిక కార్యక్రమాలతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అందరూ దైవసేవకు ముందుకురావాలని, తమకు తోచిన సాయం లేనివారికి చేయాలని కోరారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మోహన్‌దాస్, అప్పలరాం, నిత్యస్మరణానందస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు సూచించారు. మండలంలోని ఉనుకూరు గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించిన ఆయన.. పాఠశాల రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలు అంచనా వేశారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగేలా, వారి అభ్యసన సామర్థ్యాలు మెరుగయ్యేలా పాఠ్యాంశాల బోధన జరగాలన్నారు. ఆ తర్వాత విద్యార్థుల కోసం సిద్ధం చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, మెనూ ప్రకారం వంటకాలు చేయాలని, ప్రతీ వంటకం రుచి, శుచి కలిగి ఉండాలని తెలిపారు.

ఉద్యోగాలకు 29 మంది ఎంపిక



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భాస్కరరావు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 29 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు తెలిపారు. హెటిరో ప్రైవేట్ లిమిటెడ్, జై సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ కంపెనీల ఆధ్వర్యంలో జరిగిన ఈ జాబ్‌మేళాకు ఫిట్టర్ ట్రేడ్, కోపా ట్రేడ్, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లమో చదివిన వారు మొత్తం 79 మంది హాజరు కాగా వారిలో 29 మంది మాత్రమే ఆయా కంపెనీల్లో ఉద్యోగానికి ఎంపికయ్యారన్నారు.

5న జాబ్‌మేళా..

స్థానిక ప్రభుత్వ ఐటీఐలోనే ఈ నెల 5వ తేదీన కూడా జాబ్‌మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ భాస్కరరావు తెలిపారు. ఈ మేళాను హైదరాబాద్‌కు చెందిన మేథో సర్వో సంస్థ నిర్వహించనుందని, 25 ఏళ్లలోపు వయసు కలిగిన ఐటీఐ, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రానిక్ మెకానిక్ పాస్ అయిన వారితో పాటు పదో తరగతిలో 58 శాతం మార్కులతో పాసైన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నత అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు8309438446, 9000096048ను సంప్రదించాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత



పార్థసారథి కుటుంబానికి నగదు అందజేస్తున్న సర్పంచ్ అనురాధ

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి ఎరుకుల వాడకు చెందిన ట్రిపుల్ ఐటీ విద్యార్థి దాసరి పార్థసారథికి అప్పికొండ శ్రీరాములునాయుడు కుటుంబ సభ్యులు ఆర్థికసాయ చేశారు. శ్రీరాములు నాయుడు కుటుంబ సభ్యుల్లో ఒకరైన ఆ గ్రామ సర్పంచ్ అప్పికొండ అనురాధ చేతులమీదుగా పార్థసారథి కుటుంబ సభ్యులకు రూ.40 వేలను అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ దివంగత వైఎస్సార్‌సీపీ నేత శ్రీరాములునాయుడు జ్ఞాపకార్థం గత నాలుగేళ్లుగా ప్రతీ ఏడాది రూ.40 వేలు చొప్పున పార్థసారథి చదువు కోసం ఇస్తున్నామని తెలిపారు. ఈ మేరకు విద్యార్థి తల్లిదండ్రులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు అప్పికొండ గురునాయుడు, బంకురు కన్నంనాయుడు, అప్పికొండ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏడీఏ చంద్రరావు

రాజాం: అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని, షాపుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని వ్యవసాయ శాఖ రాజాం ఏడీఏ కె.చంద్రరావు వ్యాపారులను హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద రాజాం పరిధిలోని ఎరువులు, పురుగుమందుల షాపుల యజమానులు, డీలర్లతో మంగళవారం సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువుల విక్రయాలు ఉండాలని, అధిక లాభాలు ఆశించి, సిండికేట్‌గా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. అన్ని షాపుల్లో ఎరువుల వివరాలతో కూడిన రికార్డులు ఉండాలని, నిషేధిత పురుగుమందులు, కాలంచెల్లిన పురుగుమందులు విక్రయించకూడదన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి రేణుకాసాయి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన



గార్రాజుచీపురుపల్లిలో ఉద్యాన పంటను పరిశీలిస్తున్న ఏపీవో సాయిరాం

రాజాం: రైతులకు ఉపాధి హామీ పథకంలో భాగంగా అందించిన మొక్కలతో చేపడుతున్న ఉద్యాన పంటల సాగును ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో సాయిరాం మంగళవారం పరిశీలించారు. మండలంలోని గార్రాజుచీపురుపల్లి గ్రామంలో ఉద్యాన పంటలు వేసిన రైతుల పొలాలు వద్దకు వెళ్లి, ఆరా తీశారు. అనంతరం ఆయన మరికొంతమంది రైతులకు అవగాహన కల్పిసూ 14 జాతులకు చెందిన మొక్కలు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా ఉచితంగా అందిస్తున్నామని, రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఇప్పటివరకూ మండలంలో 480 మొక్కలు పంపిణీ జరిగిందని అన్నారు.

రేగిడి: మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతులకు పండ్లతోటల పెంపకం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని ఏపీవో ఎస్.హరనాథ్ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. మండల కేంద్రంలోని ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయం వద్ద మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఖరీఫ్ పనులు ప్రారంభం కాని ప్రాంతాల్లో ఉపాధి పనులు కొనసాగించాలని, రాయితీపై ఇస్తున్న జీడి,మామిడి, సపోటా, కొబ్బరి తదితర ఉద్యాన మొక్కలను రైతులకు ఇచ్చి, ఆయా పంటల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఈసీ ఎం.రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.